మాంసాహారులూ.. తస్మాత్ జాగ్రత్త..!

- కొనుగోలు చేసేటప్పుడు నాణ్యతను నిర్ధారించుకోవడం ఉత్తమం
- పండగల సీజన్ కావడంతో ఊపందుకున్న విక్రయాలు
- శీతలీకరణ కేంద్రాల్లో భారీగా నిల్వలు
- వినియోగదారులకు అధికారుల సూచనలు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన మాంసం

బిక్కవోలు : కార్తిక మాసం ముగియటంతో మాంసం విక్రయాలు ఊపందుకున్నాయి. వచ్చేది పండగల సీజన్ కావడంతో కోళ్లు, మేకలు, గొర్రెల పెంపకంపై వ్యాపారులు దృష్టి సారించారు. డిశంబర్ 31వ తేదీన మాంసం విక్రయాలు జోరుగా సాగాయి. ఆ ఒక్క రోజే భారీ ఎత్తున వ్యాపారం జరిగింది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రతిచోటా దుకాణాలు ఏర్పాటు చేశారు. రాత్రి వరకూ బిర్యానీ, తదితర వాటి విక్రయాలు చేశారు. అయితే మాంసం దుకాణాల్లో చాలా వరకు వినియోగదారులకు అమ్మగా మిగిలిన మాంసాన్ని శీతలీకరణ కేంద్రాల్లో నిల్వ చేయడం పరిపాటిగా మారింది. దీంతో నిల్వ ఉన్న మాంసంపై బ్యాక్టీరియా, వైరస్‌లు వ్యాప్తి చెందుతాయని వీటి కారణంగా మాంసంలో విష పదార్థాలు చేరి ఫుడ్ పాయిజన్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉందని పశు సంవర్థక శాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. మాంసాహార ప్రియులు మాంసం వినియోగం, కొనుగోళ్లపై జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

గుర్తించడం సులభం

రంగు, మెత్తదనం, వాసన, నీటిని పీల్చే గుణాన్ని బట్టి మాంసం నాణ్యతను నిర్ధారించవచ్చు. సాధారణంగా మాంసం ఎరుపు రంగులో ఉంటుంది. గొడ్డు మాంసం ముదురు ఎరుపు రంగులో ఉంటుంది. గొర్రె, మేకల మాంసం మధ్యస్థ ఎరుపులోనూ, పంది మాంసం తెలుపు రంగులోనూ ఉంటుంది. చిన్న వయస్సు ఉన్న పశువుల మాంసంతో పోలిస్తే పెద్ద వయస్సు ఉన్న పశువుల మాంసం ముదురు ఎరుపు రంగులో ఉంటుంది. నిల్వ ఉంచిన మాంసానికి నీటిని పీల్చుకునే గుణం తక్కువగా ఉంటుంది. ప్రతి జంతువు మాంసానికి ఒక ప్రత్యేకమైన వాసన ఉంటుంది. దానిని బట్టి మాంసాన్ని గుర్తించవచ్చు.

నియోజకవర్గంలో..

అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో 228 వరకు మాంసం దుకాణాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిలో కొన్ని చిన్న దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా ఒక్కరోజులో 15 టన్నులకు పైగా విక్రయాలు జరుగుతున్నాయి.

నిల్వ ఉంటే కలిగే మార్పులు

మాంసాన్ని సక్రమంగా నిల్వ చేయకుంటే కొన్ని మార్పులు జరిగి పాడైపోతుంది. సూక్ష్మజీవులు, శిలీంధ్రాల మూలంగా మాంసంలోని కొవ్వులు, మాంసకృత్తులు విచ్ఛిన్నమై కొన్ని మార్పులు జరుగుతాయి. సూక్ష్మజీవులు, శిలీంధ్రాలు జరిపే చర్యల వల్ల బ్యుటరిక్, ప్రోపియోనిక్‌లు ఏర్పడి మాంసం దుర్వాసన వస్తుంది. నిల్వ చేసిన మాంసంలో సూక్ష్మజీవులు స్రవించే రంగుల వల్ల మాంసం ఆకుపచ్చ లేదా గోధుమ రంగులోకి మారుతుంది. పూడోమోనాస్, స్టెఫ్లోకోకస్, లాక్టోబాసిల్లస్ వంటి బ్యాక్టీరియాల వల్ల మాంసంపై పలుచని జిగురు వంటి పొర ఏర్పడుతుంది. మాంసంపై శిలింధ్రాల వల్ల నలుపు, తెలుపు, ఆకుపచ్చని మచ్చలు, రంగు మచ్చలు ఏర్పడతాయి. ప్రోటీన్లు విచ్ఛిన్నం జరిగితే చేదు రుచి, చెడు వాసన కలుగుతుంది.

పరిశీలించి తీసుకోవాలి



మాంసం కొనుగోలు చేసేటప్పుడు చూసి కొనుగోలు చేయాలి. కొంతమంది వ్యాపారులు స్వలాభం కోసం నిల్వ మాంసం అమ్మకాలు చేస్తున్నారు. కొనుగోలు సమయంలో మాంసాన్ని పరిశీలించి తీసుకోవటం ఉత్తమం.

డాక్టర్ శ్రీనివాస్, ఏడీ, పశు సంవర్థక శాఖ, అనపర్తి

శాకాహారంతో ఆరోగ్యానికి మేలు



శాఖాహారం ఆరోగ్యానికి ఎంతో మంచిది. తాజా ఆకు కూరలు, కాయగూరలతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో మాంసాహారం ఎంత తక్కువ తీసుకుంటే అంత మంచిది.

జి.విజయలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యురాలు, బిక్కవోలు

సిద్ధి వినాయకునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామంలో ఉన్న సిద్ధి వినాయకునికి బుధవారం పంచామృతాభిషేకం, గరిక పూజలు చేశారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు అధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

క్లుప్తంగా

నన్నయ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి వీసీ శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు బుధవారం ఆవిష్కరించారు. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మరింత ఉత్సాహంతో విధులు నిర్వర్తిస్తూ, యూనివర్సిటీ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా గజేంద్రుడి విగ్రహ ప్రతిష్ఠ



బలభద్రపురంలో ప్రతిష్ఠించిన గజేంద్రుడి విగ్రహం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గజేంద్రుని విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయం వద్ద గజేంద్రుని దాదాపు రూ.2.5 లక్షలతో ఇదే గ్రామానికి చెందిన ద్వారంపూడి సూర్యనారాయణ రెడ్డి, చెల్లాయమ్మ దంపతులు సమకూర్చారు .దీనిని ఆలయం గాలి గోపురం వద్ద ప్రతిష్ఠించారు. భక్తులు గజేంద్రని శిల్పం కింద నుంచి దూరితే మోక్షం కలుగుతుందని అర్చకులు చెప్పారు. ప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజులు, అభిషేకాలు నిర్వహించారు.

మట్టి అక్రమ రవాణా

మధురపూడి: కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలోని పుష్కర, పోలవరం గట్టులకు చెందిన మట్టిని రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్నారు. గత రెండు రోజులుగా యథేచ్ఛగా ఈ కార్యక్రమం జరుగుతోంది. లారీలు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నప్పటికీ స్థానిక రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

8న ముగ్గుల పోటీలు

రాజానగరం: సంక్రాంతి సంబరాలలో భాగంగా డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దివాన్ చెరువులో ఈ నెల 8న మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు జరగనున్నాయి. వినయ్ విద్య విహార్ స్కూల్ ప్రాంగణంలో ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు ప్రారంభమవుతుంది. వీటిలో పాల్గొనే ఆసక్తి ఉన్న మహిళలు ఈనెల 5 లోగా తమ వివరాలను 94915 63344కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సుంకర వెంకటేశ్వరరావు తెలిపారు. విజేతలకు బహుమతులుగా రూ.ఐదు వేలు (ప్రథమ), రూ.మూడు వేలు (ద్వితీయ), రూ.రెండు వేలు (తృతీయ) అందజేస్తామన్నారు. మరో ఇద్దరికి రెండు ప్రోత్సాహక బహుమతిగా రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేస్తారు.

సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం



సింహ వాహనంపై విహరిస్తున్న స్వామివారు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజు సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరిగింది. బుధవారం ఉదయం సుప్రభాత సేవ, లఘుఅర్చన, తోమాల సేవ, గ్రంథ పారాయణ, పంచామృతాభిషేకం, గోపూజ. పవళింపు సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని సింహ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.


నూతన పాలకవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన పాలకవర్గ సభ్యులు

రాజానగరం: కరికాల భక్త సేవా సంక్షేమ సంఘం నూతన పాలకవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులు బైరెడ్డి మల్లిబాబు, సాంబత్తుల వీరభద్రరావు, పీతా శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా గాడి రాజారావు, ఉపాధ్యక్షురాలిగా మోటిపల్లి ఉమామహేశ్వరి, సెక్రటరీగా గాడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పాలాటి చిన మల్లికార్జునరావు, కోశాధికారిగా కొక్కిరపాటి వరలక్ష్మి, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ముంపు నీటిలో 20 కుటుంబాలు





సీతానగరంలో తొర్రిగడ్డ కాలువ సమీపంలోని ఇళ్లను చుట్టుముట్టిన ముంపునీరు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని తొర్రిగడ్డ కాలువ వద్ద నివాసం ఉంటున్న సుమారు 20 కుటుంబాలు ముంపులోకి వెళ్లాయి. పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి సాగునీటి విడుదలతో ఈ సమస్య ఏర్పడింది. రెండు పంపుల ద్వారా 240 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేయడంతో తొర్రిగడ్డ కాలువ నుంచి అధిక నీరు వస్తోంది. అది కాలువ గట్ల పైనుంచి పొంగిపొర్లుతోంది. సీతానగరం ఎస్సీపేట దగ్గరలో ఏటిగట్టును ఆనుకుని కొన్ని కుటుంబాలు, అదే విధంగా ప్రభుత్వ హైస్కూల్ దగ్గరలో కాలువను చేర్చి కొన్ని కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. తొర్రిగడ్డ కాలువ నుంచి సాగునీరు కాలువ గట్టు పై నుంచి ఇళ్లలోకి నీరు చేరింది. ముంపు నీటి కారణంగా మట్టి గోడల ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంట చేసుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నామని, బయటకు అడుగు పెట్టాలంటే మోకాలు లోతు నీటి నుంచి వెళ్లాల్సి వస్తుందని బర్రే నాగమ్మ, పాతపాటి జ్యోతి, బర్రే దేవి, కె.వరలక్ష్మి వాపోయారు. రోగాల బారిన పడే అవకాశం ఉందని, పంచాయతీ సిబ్బంది ఒక్కసారి కూడా ఇక్కడ బ్లీచింగ్ వెదజల్లలేదన్నారు. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ నుంచి సాగునీటి విడుదల తగ్గిస్తే కానీ, ముంపు నుంచి బయటపడే అవకాశం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

జగనన్న పాలన సువర్ణ యుగం



మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు శుభాకాంక్షలు చెబుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్



జక్కంపూడి రాజాకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెబుతున్న షర్మిలారెడ్డి

- కారు చీకటిని చూపిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: గడచిన ఐదేళ్లలో జగనన్న పాలన సువర్ణ యుగాన్ని తలపిస్తే.. నేడు చంద్రబాబు పాలన ప్రజలకు కారు చీకటిని చూపిస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. రాజమహేంద్రవరంలోని ఆయన స్వగృహం వద్ద బుధవారం న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని మూడు మండలాలతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జక్కంపూడి రాజా మాట్లాడుతూ జగనన్న పాలన ప్రతి రోజూ పండగలా సాగిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆ వాతావరణం లేదన్నారు. చంద్రబాబు అండ్ కో గత ఎన్నికలలో ప్రచారం చేసిన సూపర్ సిక్స్ హామీల ఊసే లేకుండా పోయిందన్నారు. విద్యుత్ చార్జీలను పేదోడి నడ్డి విరిగేలా భారీగా పెంచేశారన్నారు. ప్రజలు మెచ్చని ఇటువంటి పాలనతో పాలకులు చరిత్ర హీనులుగా మిగిలిపోతారన్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా మాజీ చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, నాయకులు మేడా గురుదత్త ప్రసాద్, సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేటలో ఆకతాయిల వీరంగం

- ముగ్గులు పెడుతున్న మహిళలతో అసభ్య ప్రవర్తన
- ప్రశ్నించిన వారిపై దాడి
- ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులకూ స్వల్ప గాయాలు

సీతానగరం: కొన్ని గంటల్లో నూతన సంవత్సరం రాబోతోంది. దానికి ఘనంగా స్వాగతం పలికేందుకు మహిళలు తమ ఇళ్ల ముందు ఉత్సాహంగా ముగ్గులు పెడుతున్నారు. ఆ సమయంలో వచ్చిన ఆకతాయిలు వారితో అసభ్యంగా ప్రవర్తించారు. అడ్డుకున్న వారిపైనా, ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులపైనా దాడి చేశారు. వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోని రాజంపేటలో మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. సీతానగరం ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట బీసీ కాలనీలో మంగళవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మహిళలు నూతన సంవత్సరం సందర్భంగా ముగ్గులు పెడుతున్నారు. ఆ సమయంలో కాటవరానికి చెందిన గాడ దుర్గాప్రసాద్ మరోవ్యక్తితో కలిసి అక్కడకు వచ్చాడు. ముగ్గులు పెడుతున్న మహిళల వద్దకు వచ్చి, బైక్ గేర్ మార్చకుండా ఎక్సలేటర్‌ను పెంచుతూ, గట్టి శబ్దం వచ్చేలా హడావుడి చేశాడు. ఆ మహిళలను అసభ్య పదజాలంతో దూషించాడు. అక్కడే ఉన్న దాసరి రాము, అతడి బావమరిది అప్పలరాజు ఆ ఆకతాయిలను అడ్డుకున్నారు. దీంతో దుర్గాప్రసాద్ తన స్నేహితులకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. వెంటనే ముగ్గళ్ల, కాటవరం నుంచి రాళ్లు, కర్రలతో కొందరు యువకులు వచ్చేశారు. మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా దాసరి రాము, అప్పలరాజును గాయపరిచారు. విషయం తెలుసుకున్న కోరుకొండ సీఐ సత్య కిషోర్, ఎస్సై రామ్ కుమార్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంతలో ఆకతాయిలు రాళ్లు రువ్వడంతో ఎస్సై రామ్ కుమార్, కానిస్టేబుళ్లు వినోద్ కుమార్, రమేష్, షరీఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆకతాయిల్లో మద్యం మత్తులో ఉన్న ఓ యువకుడు సీసా బద్దలు కొట్టి, గొంతు కోసుకుంటానని సీఐను బెదిరించాడు. ఆయన రివాల్వర్ తీసి గట్టిగా హెచ్చరించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. కాగా.. ఆకతాయిల దాడిలో గాయపడిన ఇద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన దుర్గాప్రసాద్, హర్ష, సిద్ధు, గాడ వెంకటేష్, జయసూర్య, వినయ్, మనోజ్‌తో పాటుగా మరికొందరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



రామవరంలో సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సుబ్బిరెడ్డి తదితరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజలు

పెదపూడి: నూతన సంవత్సరం సందర్భంగా రామవరంలో అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సత్తి సుబ్బిరెడ్డి, ఎంపీటీసీ గొలుగూరి గౌతమికి గ్రామంలోని సత్తి వీర్రెడ్డి గృహంలో పలువురు కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలోని వివిధ వర్గాల ప్రజలు, ఉద్యోగులు, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు వీరిని కలిసి శుభాకాంక్షలు చెప్పారు. అదేవిధంగా రామవరం గ్రామంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గృహం వద్ద అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

న్యూ ఇయర్ సందడి

- వేడుకగా కొత్త సంవత్సరానికి స్వాగతం
- ఫుల్ జోష్‌లో యువత

బిక్కవోలు: నూతన సంవత్సర ఆగమనంతో బుధవారం వేడుకలు ఊపందుకున్నాయి. మహిళలు ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. యువకులు మోటారు వాహనాలపై కేరింతలు కొడుతూ హల్‌చల్ చేశారు. రాత్రి 12 గంటలకు బాణసంచా కాల్పులతో కేక్ కట్ చేసి, ఒకరికొకరు పంచుకున్నారు. మండలంలోని పలు క్రీస్తు ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. బుధవారం ఉదయం దేవాలయాలను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంధువులు, స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. చిన్నారులు తమ మిత్రులకు గ్రీటింగ్ కార్డులను పంచారు.

అంబరాన్నంటేలా సంబరాలు

రంగంపేట: నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వివిధ వర్గాల వారు వేడుకలు చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ రంగంపేట మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల మధ్య కేక్‌లు కట్ చేసి స్వీట్లు, పంచారు. బాణసంచా కాల్చి సంబరాలు చేశారు. బుధవారం ఉదయం మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అనపర్తిలోని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఇంటికి భారీస్థాయిలో తరలివెళ్లి, కేక్‌లు, పుష్పగుచ్ఛాలు, నోట్సు పుస్తకాలు, స్వీట్లు అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాచిన గోవిందు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, వైస్ ఎంపీపీలు మట్టా శ్రీను, రాయుడు రాంబాబు, పార్టీ మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు కుసుమంచి కృష్ణంరాజు ఉన్నారు.



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని పూల కిరీటంతో సత్కరించిన కృష్ణంరాజు



అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తదితరులు

మాజీ ఎమ్మెల్యే ఇంట సందడి

పెదపూడి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అనపర్తిలో బుధవారం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి నివాసం కోలాహలంగా మారింది.

అనపర్తి నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల నుంచి పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, తరలి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, ఆయన భార్య ఆదిలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజలు, కార్యకర్తలతో సందడి నెలకొంది. నాలుగు మండలాల జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



కొమరిపాలెంలో కేక్ కట్ చేస్తున్న ప్రముఖులు



పందలపాకలో ఆకట్టుకున్న ముగ్గులు





పందలపాకలో గ్రీటింగ్ కార్డులు ఇచ్చుకుంటున్న చిన్నారులు